# చీకటి కౌగిట్లో

అలివేలు నిద్రలోంచి ఉలిక్కిపడినట్లయి మంచం మీద దిగ్గున లేచి కూర్చుంది. ఏదో చప్పుడు గట్టిగా వినబడుతూంది. ఎక్కడ ? గుండె దడదడలాడుతూండగా భయంతో చెవులు రిక్కించింది అలివేలు. ఎవరో తలుపులు దబదబా బాదుతున్నారు. శరీరంలో సన్నటి వణుకు. అలివేలు అప్రయత్నంగా తన పక్కనే చెరొకవైపు నిద్రపోతున్న పిల్లలిద్దరిపైన చేతులు వేసింది. గదిలో నీలిరంగు బెడ్‌బల్బు నిస్త్రాణగా వెలుగుతూంది. టేబిలు మీద గడియారం రాత్రి ఒంటిగంటదాటి ఇరవై నిముషాల్ని సూచిస్తూంది. వంటగది గడపమీదుగా ఎలుక ఒకటి చప్పుడు చేస్తూ పరుగెట్టి పారిపోయింది.

ఎవరు ? ఇంత రాత్రి పూట తనింటికి వచ్చి తలుపులు బాదే వ్యక్తులెవరు ? ఆయన రాత్రికి రానని ఆఫీసుకు సెలవుపెట్టి ఏదో పనిమీద ఊరికి వెళతానని పొద్దుటే వెళ్ళిపోయారు. మరింకెవరు ? దొంగలా ? ఆ ఊహరాగానే అలివేలుకు ఒళ్ళు జలదరించింది. భయంతో మరింత బిగుసుకు పోయింది. ఏం చెయ్యాలిప్పుడు ? ఒంటరిగా ఎలా ఎదుర్కోవాలి ? పక్కింటి వాళ్ళను పిలిస్తేనో ! ఊహుఁ. ఆ అవకాశం ఎంతమాత్రం లేదు. ఈ గదిలో నిలబడి గొంతు చించుకున్నా పక్కవాటాలకు వినపడదు. అలివేలు మస్తిష్కంలో అలజడి, ఆందోళన...!

అలివేలు ఆలోచనల్ని బలహీనపరుస్తూ తలుపుమీద చప్పుడు మరింత అధికమయింది. అలివేలు పిల్లలమీద దుప్పటి కప్పి నెమ్మదిగా మంచం దిగింది. మంచుగడ్డలా చల్లబడిన మనసు... నాలుగడుగులు నడిచి వసారాలోకి వచ్చింది. తలుపు గడియ తీయాలా, వద్దా అనుకుంటూ కొద్దిక్షణాలు గోడకు చేరగిలబడింది. ఎగశ్వాస పీలుస్తూ గుండెల మీద చేతులు వేసుకుంది. ఆయాసాన్ని అదిమి పెట్టుకుంది. అయినా వచ్చిన వాళ్ళు దొంగలయితే తలుపులు ఎందుకు బాదుతారు ? కాదు, ముమ్మాటికి కాదు. ఏదో జరిగింది ఎవరో వచ్చి తలుపులు కొడుతున్నారు. తను అనవసరంగా భయపడింది. అంతే !

అలివేలు గబగబా గాలిలో తేలినట్టుగా గుమ్మం దగ్గర కొచ్చింది. ధడాలున తలుపు గడియ తీసింది. గడియ తీసిన మరుక్షణం ఇంట్లోకి అడుగుపెట్టిన ఆగంతకులను చూసి కొయ్యబారి కెవ్వున కేకవేయబోయి, కొంగు అడ్డం పెట్టుకొని వెనక్కి పరుగెట్టింది. గుమ్మం దగ్గర నిలబడి గోడకు బల్లిలా అంటుకుపోయింది...

ఒకడు తుమ్మమొద్దులా నల్లగా, ఎత్తుగా ఉన్నాడు. పంచె, జబ్బల బనీను... నల్లటి ముఖంలో ఎర్రటి కళ్ళు... మెడలో వేలాడుతున్న తాయత్తు లాంటి బిళ్ళ ! చేతిలో దుడ్డుకర్ర...


మరొకడు వెదురుబద్దలా ఉన్నా కండలు తిరిగిన శరీరం. ముఖంనిండా గంట్లు. ఒంటి మీద పంచె, ఆ పంచెకు తోలుపట్కా... భుజంమీద తువ్వాలు. చేతిలో బాణాకర్ర. ఇద్దరూ ఆంబోతుల్లా ఉన్నారు. సారాయి అంగడినుంచి సరాసరి ఇక్కడికే వచ్చినట్లున్నారు.

అలివేలు వాళ్ళిద్దర్నీ బిక్కుబిక్కుమంటూ చూస్తూంది.

"నువ్వేనా అలివేలు ?" ఒకడు బొంగురు గొంతుకతో నిర్లక్ష్యంగా అన్నాడు. అలివేలు అవునంటూ తల పంకించింది. మనసులో బుసలు కొడుతూన్న కోటి భయానక సర్పాలు...!

"మీ ఆయన చలపతి నిన్ను తీస్కరమ్మన్నాడు.ఆడ సరుగుడుతోట బంగలాలో ఏడుస్తున్నాడు. నడు. ఇంటికి గొళ్ళెం పెట్టి..." మరొకడు ఆజ్ఞాపిస్తున్నట్టుగా అని ఒక అడుగు ముందుకు వేశాడు.

"మా ఆయనేమిటి ? నన్ను తీసుకురమ్మ నడమేమిటి ? ఆయన పొద్దుటే ఊరికెళ్ళారు. మర్యాదగా బయటికెళ్ళండి. లేకపోతే గోలపెట్టి



అందర్నీ పిలుస్తాను." ధైర్యం కూడదీసుకుని దాదాపు కేకలు పెట్టినట్టుగానే అంది అలివేలు.

ఒక్క క్షణం వాళ్ళు ముఖముఖాలు చూసుకున్నారు. కళ్ళతో సైగలు చేసుకున్నారు. మెరుపులా ఒకడు పరుగెత్తి వచ్చి ఆమె మీద పడ్డాడు. చేతులు వెనక్కి నెట్టి, నోరు నొక్కి తువ్వాలును మూతికి బిగించి కట్టాడు. మరొకడు వచ్చి అమాంతం అలివేలును భుజం మీద వేసుకుని గబగబా గుమ్మం దాటాడు.

బయట చీకటి స్వేచ్ఛగా విరగబడి నవ్వుతూంది. ఆకాశంలో చుక్కలు తెల్లబోయి చూస్తున్నాయి. వీధులన్నీ నిర్మానుష్యంగా నిద్ర పోతూన్నాయి. ఒకచోట కొన్ని కుక్కపిల్లలు ఆదమరచి కునుకుతీస్తుంటే, తల్లి కుక్క ముఖం పైకెత్తి దేనికో కుయ్యోమంటూ ఏడుస్తూంది.

అరవలేక అశక్తురాలై చేతులతో కొడుతూ, గిజాయించుకుంటూన్న అలివేలును భుజంమీద వేసుకుని నిర్లక్ష్యంగా మోసుకుపోతున్నారు రౌడీలు. చెఱువు గట్టుమీద చకచక నడుస్తున్నారు. చెఱువు ఒడ్డున ఒక కప్ప హీన స్వరంతో బెగబెకమంటూంది. చెఱువుకు ఒక ప్రక్కగా ఉన్న సరుగుడు తోట నుంచి గాలి పెద్దగా రోదిస్తున్నట్టు రొద చేస్తూంది.

అలివేలుకు తన నిస్సహాయ స్థితి తలచుకుంటే దుఃఖం పొర్లుకు పొర్లుకు వస్తూంది. ఇకపై ఆ రౌడీల చేతుల్లో ఎటువంటి దౌష్ట్యానికి గురి కావలసి ఉంటుందో ఊహించు కోలేకపోతూంది.

ఆమెకు తన భర్త చలపతి మనసులో మెదిలాడు. అతడి గురించిన ఆలోచనలన్నీ ఆమెకు మరింత నిస్సత్తువనీ, నీరసాన్నీ కలిగించాయి. రౌడీలు చెప్పింది నిజమే ! భర్త చలపతి నిజంగా ఆ సరుగుడు తోట పాత బంగళాలో ఉండే ఉంటాడను కుంది.

పెళ్ళయిన మూడేళ్ళనుంచి చలపతి పేకాట పిచ్చిలో ఇల్లు గుల్ల చేయడం... ఇంట్లోని నగలన్నీ అంగట్లో అమ్ముడుపోవడం... ఆఫీసు జీతం కూడా మూడువంతులు పేకముక్కలకే అంకితం చేయడం... తిరిగి అప్పులు చేయడం... అప్పుడప్పుడూ త్రాగి రావడం... పిల్లలూ తనూ ఉసూరుమని ఏడవడం... ఎప్పుడైనా ఎదిరించి అడిగితే పశువులా ప్రవర్తించి తిట్టడం, కొట్టడం... అన్నీ అలివేలు మనసును కుదిపాయి... అంతరంగాన్ని అతలాకుతలం చేశాయి.

ఆ ఊళ్ళో ఆఫీసులున్నాయి. ఆసుపత్రులున్నాయి. గుళ్ళున్నాయి. గోపురాలున్నాయి. సినిమాహాళ్ళున్నాయి. సారా బట్టీలున్నాయి. చీకటి

కంపెనీలున్నాయి. చీట్ల పేకాటకు ఊరి చివర సరుగుడు తోటలో ఒక పాడుబడ్డ నవాబుల బంగళా కూడా ఉంది. ఊళ్ళో పోలీసు స్టేషను ఉంది... దానికి పది అడుగుల దూరంలో ఫైర్ స్టేషన్ కూడా ఉంది. పోలీసు స్టేషను చీకటి కంపెనీలకు పూర్తి రక్షణ ఇస్తూ చక్కగా పోషిస్తుంది. ఫైర్ స్టేషన్ మాత్రం ఆ ఊరి చివర పాత బంగళాలోంచి పుట్టే మంటల్ని... ఆ మంటలవల్ల అన్యాయంగా తగలబడిపోయే కొంపల్ని ఎంతమాత్రం ఆర్పలేకపోతూంది.

ఆ ఊరి ఉద్యోగస్తుల్లోనూ పేకాట ఆడేవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. చలపతిలా సర్వం పోగట్టుకునిని పెళ్ళాం బిడ్డల్ని వాళ్ళ ఖర్మకు వదిలేసి పేకాటా పిచ్చితోనే ప్రొద్దుపుచ్చేవాళ్ళు మాత్రం ఎవ్వరూ లేరు. ఆఫీసు పని ఏదో అయిందనిపించుకోవడం... చెఱువు ప్రక్క తోటలోకి చల్లగా జారుకోవడం... ఏ రాత్రికో ఇంటికి చేరుకోవడం... భార్యను ఏడిపించడం తనూ ఏడుస్తూ పడుకోవడం ఇదీ అతని దినచర్య...

బంధువులు, స్నేహితులు, అధికారులు, ఆత్మీయులు ఎంత మంది మందలించినా చలపతి చలించలేదు. ఏదో ఒకరోజు తనకూ మంచి రోజులు వస్తాయంటారు... అడిగిన వాళ్ళకు అదే సమాధానం చెబుతుంటాడు...

ఆగంతకులు సరుగుడు తోటలోంచి నడిచి అలివేలును పాత బంగళా వద్దకు తీసుకెళ్ళారు. బంగళా ఒకవైపు వరండాలో అలివేలును నిలబెట్టి 'చిన్నబాబు' అంటూ ఒకడు చిన్నగా పిలిచాడు... అలివేలు సిగ్గుతో ఏడుస్తూ గోడకు తల బాదుకుంటూ ఉండిపోయింది. చుట్టూ చీకటి. కీచురాళ్ళ రొద... తెరలు తెరలుగా ఈడ్చికొడుతూన్న చలిగాలి... పాత బంగళా మరొకవైపు గదుల్లోంచి పేకటగాళ్ళ మాటలు, పెద్దగా కేకలు ఉండుండి వినబడుతున్నాయి. రౌడీలు ఇద్దరు కలిసి అలివేలు మూతికి బిగించిన గుడ్డను విప్పారు.

చిన్నబాబు గదిలోంచి బయటకొచ్చాడు. అతనికంటే ముందు అతని ఒంటిమీద మొగలిసెంటు పరిమళం బయటకొచ్చింది. అతని అసలు పేరు ఎవ్వరికీ తెలియకపోయినా అందరు చిన్నబాబుగానే పిలుస్తారు. చిన్నబాబు ఎర్రగా ఉంటాడు. అతని పెదాలు కిళ్ళీ ఎరుపుతో మరింత ఎర్రగా ఉంటాయి. లాల్చీ-పైజామా... మెడలో పులిగోరు పతకం, వయసు నలభై దాటినా ఇరవై ఏళ్ళ కుర్రాడిలానే నవనవలాడుతుంటాడు. తాతలు, ముత్తాతలు, మిగిల్చిపోయిన తరాలకు తరగని ఆస్తి... మిత్రులతో పేకాట, శత్రువులతో రాజకీయాలు ఆడటం అతని సరదాలు.

చిన్నబాబు చిన్నగా దగ్గాడు. ఒక్కసారి వెనక్కి తిరిగి తన దృష్టిని వరండా చివరకు సారించాడు. అక్కడేదో ఆకారం కదిలినట్టనిపించింది.

'ఏయ్ ! నీ పేరు అలివేలు కదూ ! అడుగో నీ మొగుడు చలపతి... నాలుగు వేలకు నాకు బాకీపడ్డాడు. ఇప్పుడు మరో వెయ్యి రూపాయలకు పేకాట్లో నిన్ను కూడా ఓడిపోయాడు. అందువల్ల ఈ క్షణం నుంచి నువ్వు నా సొంతం అన్నమాట.'

చిన్నబాబు మాటలు ఆ చీకట్లో చురకత్తుల్లా దూసుకొచ్చి అలివేలు బేలగుండెలో సూటిగా నాటుకున్నాయి. నోట మాట రాలేదు... భూమి అదిరిపడి క్రిందకు కూరుకుపోతున్నట్టనిపించింది. ఎంత దారుణం ? ఇది నిజమేనా ! భర్త తనను పేకాట్లో తాకట్టు పెట్టి ఓడిపోయాడా ? ఓడిపోయి అమానుషంగా ఈ మనిషికి సొంతం చేశాడా ? అగ్నిసాక్షిగా అందరి ముందు మూడు ముళ్ళు వేసి, జీవితాంతం తోడుగా, నీడగా నడుస్తానని ప్రమాణం చేసిన భర్త... కేవలం వ్యసనం కోసం కట్టుకున్నదాన్ని మరొకడికి అప్పగించే అధమాధమ స్థాయికి దిగజారిపోయాడా ! ఈ బంధం ఇంతటితో అంతమయిపోవలసిందేనా ! ఈ అన్యాయానికి బలి కావలసిందేనా !

అలివేలుకు బుర్రగిర్రున తిరిగిపోతూంటే... అప్పుడు చూసింది వరండా చివర గదిలోంచి పడుతూన్న సన్నటి వెలుగులో తన భర్త చలపతిని. త్రాగి ఉన్నాడేమో గచ్చుమీద పడి దొర్లుతూ ఏదో పలవరిస్తున్నట్టుగా తనలో తానే మాట్లాడుకుంటు

న్నాడు. అలివేలు భోరుమని ఏడుస్తూ పరిగెత్తుకు వెళ్ళి భర్తమీద పడింది... చేతులతో కుదుపుతూ పట్టి పైకి లేపింది. చలపతి లేచాడు. అక్కడ అలివేలును చూసి ఆశ్చర్యంగా కళ్ళు చిట్లించాడు. కొంత మత్తు వదిలినట్టుంది... 'నువ్వా, అలివేలూ' అంటూ ముద్దగా మాట్లాడుతూ భార్య చేయి పట్టుకుని పైకి లేచాడు.

"ఏవండీ ! వీళ్ళు నన్ను..." అలివేలు వణికిపోతూ భర్తకు అంటుకుపోయింది. చిన్నబాబు విలాసంగా నవ్వుతూ దగ్గరగా వచ్చాడు. అలివేలును రెక్కబట్టుకుని విసురుగా తనవైపుకు లాక్కున్నాడు... అలివేలు గొల్లుమని ఏడవసాగింది. చలపతి తాగిన మత్తులో గిజగిజలాడిపోతున్నాడు...

"చిన్నబాబుగారూ ! నా భార్య నేమీ చేయకండి... అది ఒట్టి అమాయకురాలు." చలపతి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టబోయాడు.

"నువ్వు నాకు నాలుగు వేలు బాకీ ఉన్నావా! లేవా ?" చిన్నబాబు హుంకరించాడు. చలపతి తల ఊపాడు.

'ఈ రోజు నీ పెళ్ళాన్ని కూడా వెయ్యి రూపాయల కు తాకట్టు పెట్టి ఆట ఆడావా-లేదా?' ఈసారి చలపతి మాట్లాడలేదు. బుర్ర వంచుకున్నాడు.

"మీ బాకీ ఒకనెలరోజుల్లో పూర్తిగా తీర్చేస్తాను. నా భార్యను వదిలిపెట్టండి ప్లీజ్!" చలపతి ఏడుస్తూ చిన్నబాబు కాళ్ళమీద పడిపోయాడు.

"నోర్ముయ్‌రా, చవటా! నీ ఇంట్లో ఏముందనీ అప్పు తీరుస్తావు ? నీ జీతం కూడా పూర్తిగా రావటం లేదు... నీ భార్య ఒక్కతే నీకు మిగిలిన ఆస్తి... పోరా ! పో!"

చలపతిని ముందుకు తోసి అలివేలును పక్క గదిలోకి చిన్నబాబు లాక్కొనిపోతున్నాడు.

"ఒరేయ్ ! చిన్నబాబూ... నీ భార్యని ఏమైనా చేశావా ! నీ ప్రాణం తీస్తాను !" చలపతి గట్టిగా అరిచాడు... ఆవేశంగా కేకలు పెట్టాడు. పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. అలివేలును రక్షించుకోవడానికి పరుగెత్తి కాలుజారి గచ్చుమీద దబ్బున పడి పోయాడు.

"ఒరేయ్ ! వీణ్ణి నాలుగు తన్ని ఇంట్లో పడేసి వచ్చేయండి !" చిన్నబాబు ఆజ్ఞ జారీచేసి అలివేలును గదిలోకి తీసుకుపోయాడు... అలివేలు హాహాకారాలు మధ్యగది తలుపులు కర్కశంగా మూసుకున్నాయి. ఇద్దరు రౌడీలు వచ్చి చలపతిని బరబరా ఈడ్చుకుంటూ బయటికి పోయారు...!

... ... ...

చలపతికి మత్తు పూర్తిగా వదిలిపోయింది. రౌడీలు కొట్టిన దెబ్బలతో ఒళ్ళు హూనంగా ఉంది. జుత్తు పీక్కుంటూ పిచ్చివాడిలా ఇల్లంతా కలయతిరిగాడు. తలుపులన్నీ తెరచి ఉన్నాయి... ఇద్దరు పిల్లలూ మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతున్నారు...

ఏం చెయ్యాలిప్పుడు ? అలివేలును రక్షించుకోలేకపోయిన తరువాత... తన బ్రతుకు వ్యర్థం... పేకముక్కలే జీవితం అనుకున్నాడు... పేకముక్కల్తే కలలుగన్నాడు. పేకాటతోనే ఇల్లు కడదామనుకున్నాడు. పేకాటతోనే పెళ్ళాం బిడ్డల్ని సుఖపెడదామనుకున్నాడు. కాని ఏం జరిగింది. అలివేలుకు జరిగిన అన్యాయం తలచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తోంది... ఇంత జరిగిన తరువాత అలివేలుకు తన ముఖం చూపించలేడు. ఆమెను సుఖ పెట్టడానికి బదులు, అన్ని విధాల పతనమయి తన వ్యసనానికి పణంగా పెట్టుకున్నాడు... గుళ్ళో దేవత లాంటి అలివేలును చిన్నబాబు దౌష్ట్యానికి బలిచేశాడు... తన నెవరూ క్షమించరు... అలివేలు అసలే క్షమించలేదు...

చలపతి తలను నేలకేసి బాదుకున్నాడు. ఒంటిమీద బట్టలు చింపుకున్నాడు. అలివేలు ఎంత హృదయవిదారకంగా విలపించిందో... పాపం ఆ పాడుబడ్డ బంగళాలో... ఆ చిన్నబాబు చేతుల్లో... నలిగిపోతూ ఎన్ని గొంతుకలతో రక్షించమని వేడుకుందో అనుకుంటూ తన బ్రతుకును అసహ్యించుకున్నాడు. తన పాపానికి నిష్కృతి లేదనుకున్నాడు...

చలపతి దిగ్గున లేచాడు. తెల్లవారడానికింకా మూడు గంటల వ్యవధి ఉంది. ఎక్కడా జనం

అలికిడి ఏదు. ఏదో ఊహ మనసులో మెదిలింది. స్నానాల గదివైపు నడిచాడు. సబ్బుపెట్టె గూట్లో దాచిన పొట్లాం బయటికి తీశాడు. వంట గదిలోకి నడిచాడు. అలివేలు తన కోసం వండి దాచిన అన్నం కంచంలో పెట్టుకున్నాడు. పొట్లాం విప్పి అన్నంలో కలిపాడు. అది మూడురోజుల క్రితం ఇంట్లో ఎలుకల్ల కోసం తెచ్చిన మందు. ముచ్చటగా అన్నం మూడు ముద్దలు చేశాడు. పడగ్గదిలో పిల్లల్ని ఒకసారి తృప్తిగా చూసుకున్నాడు. అలివేలును తలచుకున్నాడు... ఇదే నాకు శిక్ష అనుకుంటూ ముద్ద నోట్లో పెట్టుకోబోయాడు...

ముద్ద నోట్లో పెట్టుకోబోతూంటే చిన్నబాబు రూపం వికృతంగా, వికటాట్టహాసం చేస్తూ ఎదురుగా కనిపించినట్లయింది. చలపతి 'చినబాబూ' అంటూ పిచ్చిగా కేక వేశాడు...!

హుం, చిన్నబాబు ! ఎంత నమ్మక ద్రోహం చేశాడు ? స్నేహితుడిలా నటించాడు... ఆత్మీయుడిలా ఆదరించాడు. పేకాటకు పెట్టుబడి పెట్టాడు. త్రాగుడుకు డబ్బులిచ్చాడు. చివరకు పెద్దమొత్తంగా అప్పు చూపించి అలివేలును బలాత్కరించాడు. ఇప్పుడనిపిస్తూంది... ఇదంతా వాడు ముందుగానే తన భార్యమీద కన్నేసి, వల వేశాడు. తనచేత త్రాగించి అలివేలు మీద అప్పుపెట్టి ఆట ఆడించాడు... ఆడించి చిత్తుగా ఓడించాడు... ఎలా వాడిమీద కసి దీర్చుకోవడం ?

అవును చిన్నబాబు కూడా గిలగిలా కొట్టుకోవాలి. సిగ్గుతో, అవమానంతో తల బాదుకోవాలి... అందుకు వాడి పెళ్ళాన్ని తను పాడుచెయ్యాలి. అవసరమయితే ప్రాణం తీసి అయినా సరే ! ద్వేషం... పగ... అవమానం వేయిగొంతుకల ఘోష...

చలపతి నెమ్మదిగా లేచాడు. ఇంటి తలుపులన్నీ దగ్గరగా వేశాడు. టేబిలు మీద పళ్ళు కోసే చాకు జేబులో పెట్టుకున్నాడు. వీథిలోకి ఒక్క గెంతు గెంతి చిన్నబాబు ఇంటివైపు పరుగుపెట్టాడు.

చిన్నబాబు మేడ దగ్గర కొద్ది నిముషాలు ఆగి ఆయాసం తీర్చుకున్నాడు. గేటు మూసి ఉంది. ఎత్తుగా లేని ప్రహరీగోడ మీదుగా ఎగబ్రాకాడు. ఒంటికి గాజు పెంకులు గీసుకున్నాయి. లక్ష్యపెట్ట లేదు. గోడమీంచి దూకి పూల మొక్కల్లో కూల బడ్డాడు. నెమ్మదిగా లేచి పెదాలు బిగపట్టి మేడ వెనుక భాగానికి అడుగులో అడుగు వేస్తూ నడిచాడు. చుట్టూ చీకటి... మేడమీద ఒక గదిలో లైటు వెలుగుతూంది. అందరూ నిద్రపోతున్నట్టున్నారు. ఎవ్వరి అలికిడి వినిపించడంలేదు. దొడ్లో పశువుల పాకలో ఎద్దు మెడలో గంట ఒకటి కదిలింది. చలపతి చరచరా మెట్లెక్కి మేడమీదకు నడిచాడు. రెండు గదుల్లోకి తొంగిచూశాడు. గదులు మూసి ఉన్నాయి. నిశ్శబ్దం తాండవిస్తూంది. ఎవ్వరూ కనిపించలేదు. మరొకవైపు పిల్లిలా అడుగులు వేసి లైటు వెలుగుతూన్న గది దగ్గరకు నడిచాడు. ఆ గది తలుపులు సగం తెరచి ఉన్నాయి. లోపలికి తొంగిచూసి చలపతి కోడె త్రాచులా బుసలు కొట్టాడు... ఎదురుగా గదిమధ్య ఊయల బల్లమీద సిగరెట్ విలాసంగా కాలుస్తూ కూర్చున్న చిన్నబాబు... అతని ప్రక్కనే ఊయలబల్ల గొలుసు పట్టుకుని నిలబడ్డ చిన్నబాబు భార్య సావిత్రి...

"వీడు తోటలోంచి అప్పుడే ఇంటికి ఎలా వచ్చాడు ? తన భార్య అలివేలును నిర్దాక్షిణ్యంగా చెరచిన ద్రోహి... స్నేహం పేరిట చేరదీసి వ్యసనాల ఊబిలో ముంచిన నయవంచకుడు.. మేకవన్నె పులి. ఎలాగైనా పగ దీర్చుకోవాలి... వీడు, వీడి భార్య జీవితాంతం కుమిలి కుమిలి ఏడ్చేలా చెయ్యాలి... చిన్నబాబు భార్య గదిలోంచి గాని బయటికొస్తుందా ? బయటికి వస్తే తన పని సులువవుతుంది... అమె నోరు నొక్కి ఒంటరిగా చీకట్లో పట్టుకుని..." చలపతి రగులుతూన్న మనసుతో గదిముందు ఆవిర్లు విడుస్తున్నాడు...

"అలివేలూ ! నిన్నిక్కడకు తీసుకొచ్చినందుకు నువ్వేమీ అనుకోవద్దు. నీ సుఖాన్ని, క్షేమాన్ని కోరిన దాన్నినేను. దిగులు పడొద్దు." గదిలోంచి వినిపించిన సన్నటి స్వరం...

చలపతి అదిరిపడి లోపలికి తొంగిచూశాడు. గదిలో ఒక మూలగా శోకదేవతలా కూర్చుంది. అలివేలు. చలపతికి అయోమయంగా ఉంది... అర్థం గాకుండా ఉంది...

"అలివేలు ఇక్కడికెలా వచ్చింది ? ఆ చిన్నబాబు బలవంతంగా తీసుకొచ్చి భార్యకు

అప్పగించాడా! ఎంతకు తెగించాడు ? అన్యాయంగా దాని బ్రతుకు నాశనం చేసి... నా నుంచి వేరుచేసి శాశ్వతంగా తన సొంతం చేసుకుందామనుకున్నాడా!" చలపతి ఊగిపోతూ జేబులోంచి చాకు బయటికి తీశాడు... ఆమె కంఠం వినబడింది...

"రోజులు గడుస్తున్నకొద్దీ ఆడదాని బ్రతుకు మరింత అధ్వాన్నమయిపోతూంది. మగవాడి చేతుల్లో, చేతల్లో ఆటబొమ్మగానే జీవితం గడుపుతూంది. ఇప్పుడు నీ వ్యవహారం చూస్తుంటే నీ మొగుడు వ్యసనానికి నువ్వు గొప్ప పెట్టుబడిగా ఉపయోగపడ్డావు. ఇది ఎంత గర్వపడవలసిన విషయం ? పురాణాల్లో ఎప్పుడో ఎవరో చెబితే విన్నాను. ఇప్పుడు నిన్ను ప్రత్యక్షంగా చూస్తున్నాను. పేకముక్కల్లోని బొమ్మలకూ, నీకు తేడా కనిపించటంలేదు... ప్చ్...

"కానీ, అలివేలూ ! నిన్ను నీ భర్త పేకాట్లో పణంగా పెట్టి ఆడే స్థితికి దిగజారిపోయినా... నిన్ను ఓడిపోయి నిస్సహాయంగా నిలబడిపోయినా నా భర్త చిన్నబాబు నీలాంటి ఒక సంసార స్త్రీని పాడు చేసే సంస్కారహీనుడు మాత్రం కాదు... నీచుడు అంతకంటే కాదు. ఆయన పేకాట ఆడుతాడు. త్రాగుతాడు. తరతరాలకు తరగని అస్తి ఉంది... కాలక్షేపం కోసం ఎన్ని ఆటలైనా ఆడుతాడు. నీకూ నీ పిల్లలకూ ఆధారం ఏంవిటీ ? నీ భర్త ఉద్యోగం... ఆ ఉద్యోగం తెచ్చే జీతం ఏంవటీ ? నీ జీవితం ఏంవిటీ ?

"మొన్న మీ నాన్నగారు నిన్ను చూడటానికి వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చారు. నీ కుటుంబ పరిస్థితి... పిల్లల దైన్యం... పూటలు గడువుకొస్తూన్న నీ సహనం... అన్నీ వివరించి ఆయన నావద్ద కన్నీళ్ళు పెట్టుకున్నారు. 'మేము ఎంతమంది చెప్పినా వినటంలేదు. అధికారులతో బెదిరించినా లక్ష్యపెట్టడంలేదు. నీ భర్త ఊళ్ళో పలుకుబడి ఉన్నవాడు అంగబలం, అర్ధబలం ఉన్నాయి ముల్లును ముల్లుతోనే తీయాలి. నీ భర్తకూడా పేకాట ఆడుతాడు. ఆయనతో చెప్పి ఎలాగైన నా కూతురు కాపురం నిలబెట్టు' తల్లీ అంటూ రెండు చేతులూ పట్టుకున్నారు. నేను చలించిపోయాను. ఎలాగైనా నీకు సహాయం చెయ్యాలనుకున్నాను. ఆయనతో చెప్పాను. నా భర్త కొద్దిరోజులు పట్టించుకోకపోయినా, సతాయించి చలపతికి బుద్ధి చెప్పమని శాసించాను. ఆయన ఒప్పుకున్నారు. సాటి స్త్రీ కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూస్తూ ఎలా ఉండగలను ? కేవలం నీ భర్త కళ్ళు తెరిపించడం కోసం... నిన్ను భయపెట్టి అయినాసరే తీసుకెళ్ళి నీ భర్తముందే అవమానించాల్సివచ్చింది... బలవంతంగా నిన్ను గదిలోకి తీసుకెళ్ళి తలుపులు మూయాల్సి వచ్చింది... నడు ! నీ భర్త ఈపాటికి కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటాడు..., జరిగింది చెప్పి నిన్ను ఇంటిదగ్గర దింపుతాను. నీ భర్త ఇప్పటికైనా కళ్ళు తెరిస్తే... ఆయనకు బాకీ పట్టింపు ఎంతమాత్రం లేదు..."

చిన్నబాబు భార్య సావిత్రి అలివేలును లేపి గుమ్మంవైపు తిరిగింది... ఎదురుగా చలపతి ! ముఖం పగిలేలా ఎదురుదెబ్బతిని... ఏడ్చి ఏడ్చి... సొమ్మసిల్లి అప్పుడే కళ్ళు తెరచిన అర్భకుడిలా ! తుఫాను బీభత్సంలో కొట్టుకుపోయి...ఎక్కడో ఎక్కడో తేలి మునిగి... తేలి... ఎలాగో నీట్లోంచి తీరం చేరుకున్న అదృష్టవంతుడిలా... చీకటి కౌగిట్లో తప్పుచేసి తల వంచి సిగ్గుతో చితికి చితికి... పశ్చాత్తాపంతో వెలుగుదారులు, వెదుక్కుంటూన్న వెర్రివాడిలా ! చలపతి !.

గబగబా ఊయలబల్ల దగ్గర కెళ్ళి చిన్నబాబు రెండు చేతులూ తన కళ్ళ కద్దుకుని... అతని భార్య సావిత్రి సంస్కారానికి కృతజ్ఞతాభిషేకం చేసి... అలివేలును ఆర్తిగా పొదివి పట్టుకుని ఆ గదినుంచి బయటికి నడిచాడు చలపతి... చిన్నబాబు, అతని భార్య దీపం చూపిస్తూ గేటువరకూ వచ్చారు. చలపతి రోడ్డుమీదకు వచ్చిన తరువాత, 'అలివేలూ నన్ను క్షమించు' అంటూ భార్యను మరింత దగ్గరగా తీసుకున్నాడు.

చీకటి కౌగిట్లో ఉక్కిరిబిక్కిరవుతూన్న తూర్పుదిక్కు, అలివేలు ముఖంలా అప్పుడే తెల్లబడింది...

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
25-7-1984